

# బామ్మ బాబులు

-ఎమ్. అన్నపూర్ణారెడ్డి

అవి కొత్తగా స్కూళ్ళు తెరిచిన రోజులు.

తొమ్మిదేళ్ల శీను సాయంత్రం స్కూలు వదలగానే పుస్తకాలసంచీ సర్దుకొని, ఇంటికి బయలుదేరాడు. శీను బెంచ్‌మేట్ శ్రీధర్ పరుగెత్తుకుంటూ వచ్చి శీనును కలుసుకున్నాడు. శ్రీధర్‌కు అంటే ఇష్టం. ఇద్దరూ ఆరవక్లాసు చదువుతున్నారు. శీనుకు కూడా తన ఈడు వాడైన శ్రీధర్ అంటే ఇష్టం. అయినా తన పుస్తకాలసంచీ, బట్టలు, కలం, జోళ్ళ శ్రీధర్ వస్తువులతో పోల్చి చూసుకొని ఒకింత సిగ్గుపడేవాడు. తనకూ అలాంటివే లేవని బాధపడేవాడు. ఆ చిన్నారి మనసులో ఒకలాటి న్యూనతాభావం కెలికేది. ఇవేం ఎరగని శ్రీధర్, శీనును అంటిపెట్టుకొని తిరగడానికి ప్రయత్నించేవాడు

స్కూలు ఆవరణ దాటి, మెయిన్ గేటులోనించి రోడ్డుపైకి వచ్చారు. అప్పటికే చాలామంది విద్యార్థులు రోడ్డుమీద నడుస్తున్నారు. రిక్షాలు, లారీలు, రెండెడ్లబళ్ళు, జనాలు— ప్రవాహంలాగ రోడ్డంతా నిండిపోయి రద్దీగా ఉంది. రోడ్డులోనించి చీలిపోయి పక్కసందులోకి దూరారు శ్రీధర్ శీనులు. మరో సందు మలుపు తిరిగేరు. పెద్ద డాబాముందు ఆగిపోయాడు శ్రీధర్. గేటు తోస్తూ "రారా, శీనూ! ఇదే మా ఇల్లు! అదో మా

ఆ పాయంత్రం బాలను చక్కగా ముస్తాబు చేసి వెంట వేసుకొని తులసి సుశీల ఇంటికి పేరంటానికి వెళ్ళింది. శీను ఇంటిముంగిట పూలతోటలో మొక్కల మధ్య దిగాలుగా కూర్చుండి పోయాడు. రెక్కలు విచ్చుకొని, గాలిలో హాయిగా ఎగురుతూ వచ్చి, ఓ రంగు రంగుల సీతాకోకచిలుక శీను దగ్గరగా వచ్చి పూవుపై వాలింది. ఇంకో సమయంలో అయితే నానాతంటాలు పడి దాన్ని పట్టుకొని కాస్సేపు ఆడి, రెక్కలు విరిచేసి ఆనందపడి ఉండేవాడే! ఆ వేళ వాడికి అలా చేయ బుద్ధి కాలేదు. 'నీవు అట్లా ఎగురుకొంటూ వచ్చేస్తే మీ అమ్మ నిన్ను కొట్టదూ?...నీవు.. నీవు మీ ఇంట్లో ఎవరి పోలిక?' అంటూ నెమ్మదిగా సీతాకోకచిలుకను ప్రశ్నించాడు. శీను భాష అర్థం చేసుకో లేని సీతాకోకచిలుక ఒక్కొక్క పూవు మీద వాలుతూ, గాలిలోకి లేస్తూ తోటంతా కలియ తిరుగసాగింది.

శీను తండ్రి, వేణు పాయంత్రం వాహ్యాళినుండి తిరిగి వచ్చారు. అటు నుండి తులసి, బాల ఇద్దరూ వచ్చేశారు. బాల, వేణుల ముఖాలు మార్చి మార్చి చూశాడు శీను. 'ఒకరు అమ్మ పోలిక, ఒకరు నాన్న పోలిక! అందుకని వాళ్ళ అమ్మా నాన్నలకు ఇష్టం. నేను బొమ్మ పోలిక! అందుకే నేనంటే ఎవ్వరికీ ఇష్టం లేదు!' మనసులోనే గొణుక్కున్నాడు.

తులసి రావడం రావడం రుసరుస లాడుతూ వచ్చింది. "బాలా! పెట్టె పైన గుడ్డలున్నాయి. ఇవి విడిచేసి అవి తొడుక్కో!" అంటూ హెచ్చరించి, "సెంగినాదం! ఈవిడే పెద్ద బొమ్మల కొలువు పెట్టినట్టు మిడిసిపాటు! ఒక్క బొమ్మన్నా చూడముచ్చటగా లేదు! మా చిన్నతనాన ఓ గదినిండా పెట్టే వాళ్ళం. ఎన్నెన్ని బొమ్మలు! ఆటకమీద నుండీ బుట్టలు దింపలేక మా చిన్నన్నయ్య అవస్థ పడిపోయేవాడు.

కొండపల్లిబొమ్మలు, నిర్మల్ బొమ్మలు! తిరుపతి బొమ్మలు! దేవుళ్ళ బొమ్మలు! మణిపురి బొమ్మలు! అంటూ వీధిలోకి వచ్చిన బొమ్మల్లా మా అమ్మ కొనేసేది!

ఈవిడ పెట్టింది కొలువు! ఒక అందం లేదు, చందం లేదు ఆబొమ్మల్లో. పైగా అవన్నీ చేత్తో చేశానని గొప్పలు చెప్పుకుంటూంది! బోలెడంత డబ్బు దాచుకుని ఏం చేస్తారో? బొమ్మలు కొనడానికి కక్కుర్తే! చేతి వస్తువులట! వా ముఖం లాగున్నాయి!" గడపలో కూర్చొని చేతులు తిప్పుకుంటూ వడవడ వాగుతూన్నది తులసి.

గదిలోకూర్చొని పేపరు తిరగేస్తూ, "ఏమిటే నీ నసేదీ? ఎవ్వరిని గురించేమిటి?" అని ప్రశ్నించాడు శీనుతండ్రి.

"ఆ! ఎవ్వరైనా ఎందుకు? ఎదరింట్లో లేదూ! ఓ అందాలభరిణి! ఆవిడగారు! ఊళ్ళోవాళ్ళ గొడవలన్నీ ఆవిడ గారికే కావాలి! పైగా పొద్దునే వచ్చి అంటుంది నాకు పిల్లలను పెంచటం చాతకాదుట. ఒక్కొక్కరిని ఒక్కొక్క కంట చూస్తానట! పిల్లలను పెంచడం నాకు చాతకాకపోతే, ఆ గొడ్డుదానికేం చేతనైందంటా? నాకు నీతులు చెప్పుతూంది!" ఆవేశంగా అరవసాగింది.

భర్త ఏమీ మాట్లాడకపోయేసరికి, "నా బిడ్డలను నా ఇష్టం వచ్చినట్టు కొట్టుకుంటాను, తిట్టుకొంటాను. కందకు లేని దురద కత్తిపీట కెందుకు?" అంటూ లేచి తన గదిలోకి వెళ్ళిపోయింది.

ఆ రోజు మొదలు తల్లిదగ్గిరకు చనువుగా వెళ్ళేవాడు కాదు శీను. అసలు తండ్రి ఎప్పుడూ దగ్గిరికి తీసేవాడు కాదు. దానికితోడు వేణు పడనిచ్చేవాడూ కాదు. అన్నలా చొరవగా తండ్రిని సమీపించాలని ఉన్నా ఆ కోరిక చంపుకొని దూరదూరంగా ఉంటూ తన చుట్టూ ప్రత్యేక ప్రపంచాన్ని నిర్మించుకోవడం మొదలెట్టాడు. బజారులో పెద్దవాళ్ళ వెంట తన ఈడుపిల్లలు కనపడితే, వాళ్ళముఖాలు,పెద్ద వాళ్ళముఖాలు మార్చి మార్చి చూసేవాడు. తండ్రిచెయ్యి పట్టుకొని, ఆనందంగా కబుర్లు చెప్పుకొంటూ నడిచే కుర్రవాళ్లను ఆసక్తిగా చూసేవాడు. ఒక్కోసారి అసూయలాంటి భావం కలిగేదికూడా.

రాను రాను శ్రీధర్ ఇంటికి పోవడం కూడామానేశాడు. పెద్దపరీక్షలయ్యాయి. ఎండాకాలం సెలవు లిచ్చారు. మునుపటి లాగ కుర్రాళ్లతో ఆడుకోవడం మానేశాడు. ఎప్పుడూ ఒంటరిగా బాదంచెట్టు కిందనో, తప్పితే ముందువేపు తోటలోనో కూర్చుని గాలిలో ఎగిరే పక్షులను, చెట్లలో తిరిగే ఉడుతలను చూస్తూ గడిపేవాడు. ఒక్కొక్కసారి 'నా కెవ్వరు లేరు!' అంటూ బాధపడేవాడు. మందకొడిగా తయారయ్యాడు రానురాను.

• • •

కాలచక్రం పరుగులిడుతూంది. తిరిగి స్కూళ్ళు తెరిచారు. శీను ఏడవ క్లాసుకి వెళ్ళాడు. మందకొడిగా గడిచిన రోజుల నుండి తేరుకొని, సంతోషంగా బడికి వెళ్ళాడు. శ్రీధర్ కనిపించలేదు. తక్కిన వాళ్ళంతా కనిపించారు. కొంతమంది నవ్వారు. కొంతమంది ఏడుపుముఖాలతో కనపడ్డారు.



రెక్కలు విచ్చుకొని, గాలిలో హాయిగా ఎగురుతూ వచ్చి, ఓ రంగురంగుల సీతాకోక చిలుక...

పాయంత్రం వస్తూ, శ్రీధర్ కోసం వాళ్లింటికి వెళ్లాడు. తోటలో కుక్క "భౌ" మంది. అదిరిపోయి కదలకుండా అక్కడే నిలబడిపోయాడు శీను.

"ఎవ్వరు కావాలి?" అంటూ ఓ పదిహేనేళ్లమ్మాయి వోణీ సవరించుకొంటూ వరండాలో నిలబడి అడిగింది. 'అరె!, శ్రీధర్‌కు అక్క లేదే?' అనుకొంటూనే "శ్రీ శ్రీధర్ కావాలండీ!" అని తడబడుతూ మాట్లాడాడు.

"శ్రీధరా! ఎవ్వరూ లేరే!" అంటూ నొసలు చిట్లించింది.

అంతలోనే తోటమాలి ఆటుగా వచ్చి "ఈ ఇంట్లో ఉన్న ఇంజనీరుబాబుకు బదిలీ అయింది. బాబూ.వారెళ్లి అప్పుడే నెలైపోయింది" అని చెప్పేసరికి గట్టిగా ఏడవాలనిపించింది. బరువుగా అడుగులు వేసుకుంటూ ఇంటిదారి పట్టాడు శీను.

"కొత్తపుస్తకాలు! కొత్తబట్టలు! అంతా కొత్తకొత్తగా ఉంది వ్యవహారం. పుస్తకాలకోసం, కొత్తసంచి వస్తుందని ఉవ్విళ్లూరాడు శీను. వాడి ఆశలన్నీ అడిఆశలయ్యాయి. వేణు చక్కగా మంచి జిప్‌వేసిన సూట్‌కేస్‌లాంటి సంచి కొనిపించుకొన్నాడు తండ్రిచేత. అలాగే మంచి పైలట్ కలం, కొత్త జోళ్లూకూడా కొనిపించాడు. అది చాలదని వాడు కొత్త వస్తువులు తెచ్చి శీనుకు చూపించాడు గర్వంగా. అవన్నీ చూసేసరికి శీనుకు ప్రాణం ఊరుకోలేదు.

"నాన్నగారి నడిగి నేనూ కొనిపించుకుంటాలే!" అన్నాడు.

"పాపం! నీ కేం కొనివ్వరు నాన్నగారు!" అన్నాడు వేణు.

శీను పరాపరి వెళ్లి తండ్రి ఎదట నిలబడ్డాడు. శీను తండ్రి ఆఫీసుకు వెళ్లడానికి తొందరపడుతున్నవాడల్లా తల ఎత్తి "ఏం! రా, ఏం కావాలి?" అని ప్రశ్నించాడు.

"మరే. . . మరే! నాకు కూడా అన్నయ్యలాంటి సంచి, కలం కావాలండీ" అంటూ మాటిగా తండ్రి ముఖంలోకి చూశాడు.

"కొత్తవి నీ కెందుకురా? ఇదివరకు అన్నయ్య వాడుతూన్న సంచి, కలము ఇస్తాడులే!"

"ఊహూ! నాకు పాతవి వద్దండీ కొత్తవే కావాలి!"

"ఒరేయ్! నీవు వెలగబెట్టే ఏడో

స్కూలుదారి పట్టాడు శీను. స్కూలుకు వెళ్ల బుద్ధి కాలేదు. 'నే నేమైపోయినా ఇంట్లో ఎవ్వరికీ పట్టదు. అలాంటప్పుడు అసలు చదువుకోక పోతేనేం?' అనుకొంటూ స్కూలుదారి తప్పించి పక్కదారి గుండా వెళ్లి, మామిడితోటలో దూరాడు. అప్పటికే అక్కడ తన లాంటి కుర్రకారు చేరి గోళీకాయలు, కోతికొమ్మచ్చులు ఆడుతున్నారు. ఊరికే చూస్తూ నుంచున్నాడు. అక్కడ వాడికి బాగా కాలక్షేపం జరిగింది.

స్కూలు వదిలే టైముకి అంతా బిలబిలమని ఇళ్లకు వెళ్లిపోయారు. శీనుకూడా వెళ్లి భోజనంచేసి తిరిగి తోటలోకి చేరుకున్నాడు.

ఇంట్లో స్కూలుకు వెళ్లినట్టు నటిస్తూ, తోటలో తిరుగుతూ మోసం చేస్తున్నందువల్ల తలిదండ్రులమీద కసి తీరుతుందనుకొన్నాడు. అలా చేస్తున్నందువల్ల తనేదో సాధిస్తున్నానని సంతృప్తిపడ్డాడు. మనస్సుకు హాయి అనిపించింది.

చిన్నగా గోళీకాయలాడ్డం, అగ్గిపెట్టెల బొమ్మలతో జూదం ఆడ్డం నేర్చుకున్నాడు. అలా ఆడి కాసిన్ని అగ్గిపెట్టెల బొమ్మలుకూడా గెలిచాడు.

వారం రోజులు గడిచిపోయాయి. ఇంట్లోవాళ్లకు అనుమానం కలగకుండా జాగ్రత్తపడ్డాడు. ఉదయాన్నే మార్కెట్టునుండి కూరలసంచీతో వస్తున్న శీను తండ్రిని శీను క్లాసు మాస్టారు పలకరించాడు.

"శీను స్కూలుకు రావడం లేదు. ఏమన్నా సుస్తీగానీ చేసిందా?" అని అడిగేసరికి శీను తండ్రి విస్తుపోయాడు.

"అలాంటిదేం లేదండీ! నియమంగా స్కూలుకు వస్తున్నాడు! అయినా విచారిస్తాలెండి!" అని ఇంటికి వచ్చాడు.

శీను అప్పుడే సంచితో స్కూలుకు తయారవుతున్నాడు. కూరలసంచీ భార్య కందించి "శీనూ!" అని పిలిచాడు తండ్రి.

మౌనంగా ఎదటకు వచ్చి నిలబడ్డాడు శీను.

"స్కూలుకు సరిగా వెళుతున్నావా?"

ఏమాత్రం తొణక్కుండా "వెళుతున్నానండీ!" అని సమాధానం ఇచ్చాడు శీను.

కోపం ఆవేశించింది. "అబద్ధం చెప్పుతావా, వెధవా? నీవు వారం పది రోజులుగా స్కూలుకు రావడం లేదని మీ మాస్టారు ఇప్పుడే చెప్పారు. చెప్పు! ఎక్కడికి వెళుతున్నావో? ఏం చేస్తున్నావో?" నడుంనుండి తోలు బెల్టు తీసి కాలిమీద ఒకటి అంటించాడు.

శీను కళ్లలో నీళ్లు సుళ్లు తిరిగాయి.

"ఏమిటి? వీడు బడికి వెళ్లడం లేదూ? ఎక్కడ తిరుగుతున్నాడైతే?" నోరు నొక్కుకుంటూ ఎదట నిలబడ్డది తులసి.

"చెప్పవోయ్! చెప్పకపోతే నీవు చీరేస్తాను. ఆఫీసులో అడ్డచాకిరీ చేసి డబ్బు తెచ్చేది, మీరు చదువుకొని వృద్ధిలోకి రావాలనేరా, వెధవా? నేను పడే పాట్లు నీకు అర్థంకావురా! అడ్డగాడిదలా స్కూలు ఎగ్గొట్టి జులాయిలా తిరుగుతావా? అన్న చూడు! బుద్ధిగా చదువుకోవడం లేదూ? నీ కేం రోగం వచ్చింది? వాడిని చూసి నేర్చుకోరాదూ? చెప్పు!" అంటూ మరి రెండు అంటించాడు.

మొండితనం ఆవేశించిన శీను నోరు మెదపలేదు. కన్నీరు ఇంకిపోయింది. "హు!" అన్నట్టు తిరస్కారంగా చూశాడు.

"చూశారా! చూశారా! వాడి చూపులు! వీడి కప్పుడే రౌడీబుద్ధులు అలవడ్డాయి!" అంటూ కాస్త ముందుకి వచ్చి "వెధవా! సమాధానం చెప్పు!" అంటూ బుగ్గలు నులిమి వీపున రెండు అంటించింది తులసి.

బెల్లంకొట్టిన రాయల్లే ఉలక్కుండా పలక్కుండా నుంచున్నాడు శీను.

"ఔరా! ముదిరింది వ్యవహారం!" అంటూ పసివాడన్న విచక్షణ లేకుండా ఒళ్లంతా బెల్టుతో వాతలు పెట్టాడు శీను తండ్రి.

"ఇంకా అంటించండి! అంత మొండితనం ఎందుకో వీడికి!" అంటూ తులసి నుంచుందేకాని అడ్డు రాలేదు.

శీను లేత శరీరమంతా వాతలు తేలి బురబురమని వాచిపోయింది.

'అన్నం తినకుండా కడుపు మాడ్చుకొంటే వీళ్లకు జాలిలేదు కానీ, బడికెళ్లకపోతే బాధెందుకో?' అనుకుంటూ తన కేమీ పట్టనట్టు నిశ్చలంగా నిలబడ్డాడు శీను.

"నా మాటంటే ఖాతరు లేదురా నీకు! పద, ఎండలో ఒంటికాలుమీద నుంచో! కాలు దించావో తరవాత నీ పని పడతా! అప్పుడైనా చెప్పుతావేమో సమాధానం!" అంటూ మెడ పట్టుకొని పెరడువైపు నెట్టుకొంటూ వెళ్లి ఎర్రటి ఎండలో నుంచోపెట్టాడు శీను తండ్రి.

"ఏమేవ్! వీ డెప్పుడు సమాధానం చెప్పితే అప్పుడే వీడిని లోనికి రానివ్వు! నేను వచ్చేవరకూ అన్నం పెట్టవద్దు!" అంటూ బట్టలు వేసుకొని ఆఫీసుకు వెళ్లిపోయా డాయన.

'నాన్నకు నే నంటే కాబట్టదు. అమ్మకు ఇష్టం లేదు. నే నేమైపోతే వీళ్ల కెందుకు?' అనుకొంటూ ఒంటికాలిమీద ఎండలో నుంచున్నాడు శీను.

"ఎందుకు ఈలాంటి పాపిష్టి బిడ్డలు? దేశానికి బరువు! రూపమే ననుకొంటే బుద్ధులుకూడా ఆ ముండవే పుణికి పుచ్చుకున్నాడు తల్లో!" సైకే అనేసి తులసి ఇంట్లోకి వెళ్లింది.

సూర్యుడు నడినెత్తికి వచ్చాడు. ఎండ నిప్పులు చెరిగిపోస్తూంది. శీను పారిపోదామని చూశాడు. ఉన్న ఒక్క తలుపు తల్లి మూసేసింది. గోడ దూకుదామంటే చాలా ఎత్తుగా ఉంది. అప్పటికే వాడిలో విరక్తిభావం ఎక్కువైపోయిందేమో! ఏకొంం చేస్తారో నేనూ చూస్తా నన్న స్థాయికి వచ్చేశాడు.

శ్రీధర్ తల్లి శ్రీధర్ను "ఎండలో తిరగద్దు! జ్వరం వస్తుం"దని మందలించిన విషయం గుర్తుకు వచ్చింది. 'మరి తను ఈ ఎండలో నుంచున్నాడు. తనకూ జ్వరం వస్తుందా?' ఏమో? వస్తేనే మంచిది. బాగా చచ్చిపోవచ్చు. అప్పుడు తన్నెవ్వరూ తిట్టరు. చచ్చిపోతాను! బాగా చచ్చిపోతాను!' నిశ్చయించుకొన్నాడు శీను.

సాయంత్రం శీను నాన్నగారు ఇంటికి వచ్చేసరికి వడగాలికి ముఖమంతా పీక్కుపోయి, కమిలిపోయిన ముఖంతో శీను అలాగే ఒంటికాలుమీద నుంచుని ఉన్నాడు. "ఏరా! సమాధానం చెప్పవా? ఎక్కడికి వెళ్లావో, ఏమి చేశావో చెప్పదలచ లేదా? కనీసం మేము తల్లి, తండ్రి అన్న గౌరవంతోనైనా చెప్పరా!" అంటూ తండ్రి ఇంట్లోకి తీసుకువెళ్లాడు శీనుని.

"ఏమేవ్! కాసిన్ని మంచినీళ్లన్నా ఇవ్వు! వీడు సోలిపోతున్నాడు!" అని కేకేశాడు.

శీను మాత్రం నోరు తెరవలేదు. దెబ్బలు సలుపుతున్నాయి. మనసంతా ఆవేదనతో నిండిపోయింది. అర్థంకాని దిగులు పట్టుకుంది. విరక్తి జనించింది. 'నే నంటే ఎవ్వరికీ అక్కరలేదు. పోనీ, బామ్మకుకూడా ఇష్టం లేదా?' అని ఆలోచిస్తూ మౌనంగా పడుకున్నాడు.

* * *

మరుదినం ఉదయాన్నే శీను లేవలేకపోయాడు. మూసిన కన్ను తెరవకుండా పడి ఉన్న శీనును కేకవెయ్యసాగింది తులసి. తనకు ఐక్యం కాక భర్తకు ఫిర్యాదు చేసింది. శీను తండ్రి రెండు మూడు సార్లు పిలిచాడు. తరవాత బెదిరించాడు. అయినా చలనం లేకపోయేసరికి ఒంటిమీద చెయ్యి వేసి చ్రరువ వెనక్కు తొక్కొన్నాడు.

శీను శరీరం జ్వరంతో పేలిపోతూంది. హడావిడిగా హాస్పిటల్కు తీసుకువెళ్లాడు. డాక్టరు చూచి జ్వరం మరీ ఎక్కువగా ఉందని హాస్పిటల్లో ఉంచెయ్యమన్నాడు.

మల్లెపూవులాంటి దుప్పట్లమధ్య అచేతనంగా పడిఉన్నాడు పదేళ్ల శీను. తలమీద మంచుగడ్డలు నింపిన సంచీ, ఒళ్లంతా మంచునీట తడిపిన తువ్వాళ్లు కప్పిఉన్నాయి.

'నే నంటే ఎవ్వరికీ ఇష్టం లేదు!... అమ్మకు నే నంటే కోపం! ఊఁ! అబ్బా! నన్ను... కొట్టద్దు!... నాన్నా!... అయ్యో!... నొప్పి!... వద్దు!... వద్దు!... నన్ను కొట్టద్దు! బామ్మా! నేను!... నేను... నీ లాగ...

# వసంతోదయం

## చందూ

చివురులు వెట్టె మ్రోడులు, విశీర్ణ లతా
ప్రకరమ్ము పాగి పెన్
జవమున పూవులన్ విరిసె, జవ్వన మం
దెను రేలు సాంద్రమై
కవిసిన పండువెన్నెలల, కమ్మని తావుల
నుర్వి నెల్లెడన్
పవనుడు పంచె, కోయిలలుపాడె వసంతుని
గూర్చి హాయిగాన్! ★

ఉన్నా. . . ఏయ్!. . . శ్రీధర్! ఒరే!. . . ఒసే!. . . బాలా!. . . నాకూ . . . పెట్టవ్!. . . అయ్యో!. . . వద్దు!. . . స్కూలు కెళ్లను!. . . నేను . . . చచ్చిపోతాను!. . . జ్వరం!. . . చచ్చిపోతాను!. . . శ్రీధర్!. . . నేను! బామ్మ!. . . వచ్చేస్తా!. . . అబ్బా! ఎండ!. . . దాహం!. . . కొట్టకండి!. ." అంటూ పిచ్చిపిచ్చిగా కలవరింతలు మొదలుపెట్టాడు.

ఆడుతూ, పాడుతూ తిరిగే కుర్రవాడు ఆ విధంగా తయారయ్యేసరికి శీను తండ్రి బాధపడ్డాడు. అయినా వాడికంత పెంకెతనం, మొండిపట్టుదల ఎందుకో అర్థం కాలేదు. జ్వరంతో ఎండిపోయిన పెదిమల వంక చూస్తూనే కూర్చున్నాడు.

కలవరింతలు ఎక్కువయ్యాయి. శీను తల్లి మంచం దగ్గరే కూర్చుంది.




* * *

డాక్టరు గదిలో చెరో కుర్చీలోను కూర్చున్నారు శీను తల్లి, తండ్రి.

"డాక్టరుగారూ! అబ్బాయికి జ్వరం ఎక్కువైపోతూంది. పైగా పిచ్చిపిచ్చిగా కలవరిస్తున్నాడు. కాస్త మంచి మందు లిచ్చి, జ్వరం త్వరగా తగ్గేట్టు చూడరూ!" ప్రాధేయపూర్వకంగా అడిగాడు శీను తండ్రి.

చేతిలో స్టెతస్కోపు అటూ ఇటూ తిప్పుతూ ముఖంలో ఏ భావమూ కనపడనీయకుండా కూర్చున్నాడు డాక్టరు. కాస్సేపు నిశ్శబ్దం. . .

"మిస్టర్! జ్వరం రావడానికి ముందేమైనా సంఘటనలు జరిగాయా?" గంభీరంగా ప్రశ్నించాడు డాక్టరు.

శీను తండ్రి ఉన్నది ఉన్నట్టు వివరించాడు.

"ఓ! ఐ సీ! నాకిప్పుడర్థమౌతూంది ఆ అబ్బాయి అలా పలవరించడంలో అర్థం!" అంటూ భ్రుకుటి ముడిచాడు. కాస్సేపు కళ్ళు మూసుకుని ఏమిటో ఆలోచిస్తూ ఉండిపోయాడు.

కళ్ళు తెరిచి నిశ్చలంగా శీను తండ్రి కళ్ళలోకి చూస్తూ "చూడండి! మిస్టర్, నేను పిల్లల వైద్య నిపుణుడినే కాకుండా పిల్లల సైకాలజిస్టునుకూడా! చాలామంది తల్లిదండ్రులు పిల్లలను కంటారేగానీ, వారికి సాకడం చేతకాదు. వాళ్ల ఆలనా పాలనా చేతకాదు. ఏదో తినడాని కింత తిండి, కట్ట బట్ట ఇస్తున్నాం! ఇంతకన్నా ఏం కావాలని కొంతమంది అభిప్రాయ పడుతుంటారు.

"పిల్లల పెంపకంలో, తల్లి ముఖ్య పాత్ర వహిస్తుంది. ఆ తరవాత తండ్రి. పిల్లల మనసుల్లో ఏ కల్మషమూ ఉండదు. దేవుళ్లలాంటి వారు పసిపిల్లలు. అలాటి పిల్లలపై ప్రేమ, మమత, అభిమానం కురిపిస్తూనే, తప్పు చేసినప్పుడు వాళ్ళ అర్థం చేసుకునేలా మందలించి మంచి దారి చూపాలి. అలా కాకుండా తప్పు చేసినందుకు పెద్ద శిక్ష విధిస్తారు. అంతటితో ఊరుకోరు! పదేపదే దెప్పిపొడుస్తూ, సాధిస్తూ దూరంగా ఉంచుతారు.

"లేతహృదయంలో. ప్రేమనే నింపాలి గాని, పగను, ద్వేషాన్ని నింపకూడదు. తన తలిదండ్రులు తనను ద్వేషిస్తున్నారని, దూరంగాఉంచుతున్నారని ఏమాత్రం పసిగట్టినా ఆహృదయం వ్రక్కలౌతుంది.

"పసిబిడ్డ తన కన్నబిడ్డ కాకపోయినా ప్రేమ, మమత నింపి 'తన బిడ్డ' అన్న భ్రమతో పెంచితే అది తనదే అవుతుంది. స్వంతబిడ్డనయినా ద్వేషిస్తూ, సాధిస్తూ, తగు శ్రద్ధ చూపక దూరంగా ఉంచితే, మమతలు తెగిపోయి పరాయివాళ్లవుతారు. ఒక్కోసారి శత్రువులే అవుతారు.

"పెద్దవాళ్లకేగానీ, పిల్లవాళ్లకు సమస్య లుండవని కొందరు అభిప్రాయ పడుతుంటారు. అందుకే పిల్లలమాటలకు విలువ ఇవ్వరు. ఇంట్లో సామాన్యంగా నలుగురు పిల్లలున్నారంటే ఒక్కరిని సాటిగా తీసుకొని తక్కిన పిల్లలను సాధిస్తూంటారు. పరాయివాళ్ల ఎదట కించపరుస్తూంటారు.

"పిల్లల మేధ అంతా ఒకే స్థాయిలో ఉండదు. తెలివిగలవాళ్ళు ఉంటారు, కాస్త మందకొడివాళ్ళు ఉంటారు. ఎవ్వరికి తగ్గ ప్రోత్సాహం వాళ్ల కిచ్చి దారి చూపించాలే కాని, 'నీ ముఖం! నీ కేం చాతవును!' అంటూ కించపరచకూడదు. పిల్లలకు అభిమానం జాస్తి. ఒక్కసారి ద్వేషించడం మొదలు పెట్టారంటే వాళ్లను మార్చడం ఎవ్వరి తరము కాదు. కొంతమంది తల్లులు వ్యక్తిగతంగా ఏదో కారణంగా పిల్లలను ద్వేషిస్తూంటారు. అలా చేసినందువల్ల తీరని నష్టం అనుభవించాలి.

"మీ అబ్బాయి కలవరింతలు చూస్తూంటే, మీలో ఎవ్వరో అతడిని ద్వేషిస్తున్నారని నా అనుమానం. తనను నిండుహృదయంతో ప్రేమిస్తున్నారని తెలిస్తేతప్ప బాబు కోలుకోవడం దుర్లభం!. . ."

పిడుగుపాటుకు కంపించినట్టు అదిరిపడ్డాడు శీను తండ్రి.

"శీను ఇలా అవడానికి కారణం నేనే" అంటూ అటు తులసి, ఇటు శీను తండ్రి జలజలా కన్నీరు కార్చసాగారు. "తండ్రిగా ఒక్కనాడైనా చేరదీసి మంచి చెడ్డలు విచారించలేదే!" అంటూ పశ్చాత్తాపపడ్డాడు శీను తండ్రి.

"డాక్టర్! ఆ ప్రైవరెక్వియా పేషెంటు కళ్ళు తెరిచాడు!" అంటూ నర్సు వచ్చి చెప్పింది.

వెంటనే అంతాలేచి మంచం దగ్గిరికి వెళ్లారు.

శీను కళ్ళు తెరిచి ఉన్నాడేకాని అందులో జీవం లేదు. గాజుపెంకుల్లా ఉన్నాయి. పలవరింతలు ఆగిపోయాయి. ముఖమంతా కందగడ్డలా ఉంది. వేడి ఊపిరి భారంగా వదులుతున్నాడు. ఎండిపోయిన పెదవులు వణుకుతున్నాయి.

"బాబూ!" అంటూ తలపై చేయి వేసి ఆప్యాయంగా నిమిరాడు శీను తండ్రి. నోట్లో గుడ్డ కుక్కుకుంటూ వచ్చే దుఃఖాన్ని ఆపుకొంటూ ఒళ్లంతా తడుము సాగింది తల్లి. అప్రయత్నంగా మశీల జ్ఞాపకానికి వచ్చింది!

"బాబూ! నీవు మాకు కావాలి! నీవు మాకు కావాలి!" వాపోయాడు తండ్రి.

శీను చూపు లెక్కడో ఉన్నాయి. ఇవేం గమనించడం లేదు. తన కోసం తల్లి, తండ్రి హృదయమంతా ప్రేమ నింపుకొని ఉన్నారని తెలియని శీను "బామ్మా!. . . వస్తున్నా. . ." అంటూ ఆకాశంవైపు చేయి చాపబోయి కొయ్యబారిపోయాడు. ★